క్లుప్తంగా

ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు



ప్రశంసా పత్రాలు అందుకున్న ఉద్యోగులతో డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

హుస్నాబాద్: ఆర్టీసీ డిపోలో బుధవారం ఆదర్శ ఉద్యోగుల అభినందన సభ నిర్వహించారు. మార్చి, ఏప్రిల్‌లో లక్ష్యం మేర ఆదాయం సాధించిన కండక్టర్లు, డిజిల్ ఆదాచేసిన డ్రైవర్లను డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు అభినందించారు. అనంతరం ఆదర్శ ఉద్యోగులకు ప్రగతి చక్ర అవార్డులు అందజేశారు. ఉద్యోగులు సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు.

విద్యార్థుల జాబితా విడుదల

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపల్ పరిధిలోని లచ్చపేట మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థుల జాబితా విడుదల చేసినట్లు ప్రిన్సిపాల్ సుప్రియ బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యార్థుల జాబితా పాఠశాల ఆవరణల్లో, దుబ్బాక మండల వనరుల కేంద్రంలోని నోటీస్ బోర్డులో ఉంచినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ ధ్రువపత్రాలను పాఠశాలలో సమర్పించాలన్నారు. అలాగే 7, 8, 9, 10వ తరగతి ప్రవేశానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షలో మెరిట్ సాధించిన విద్యార్థుల జాబితా కూడా నోటీస్ బోర్డులో ఉంచినట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి విద్యార్థులు ఆన్‌లైన్‌లో మే 31లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ఇసుక డంప్‌తో ఇబ్బంది



చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద డంప్ చేసిన ఇసుక

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న రెండు లారీలను పోలీసులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. ఈ ఇసుకను చిన్నకోడూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద డంప్ చేశారు. ఆరు నెలలుగా ఉండటంతో కార్యాలయానికి పనులపై వచ్చే ప్రజలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. సీజ్ చేసిన ఇసుకను వెంటనే వేలం వేయాల్సి ఉన్నా ఆరు నెలలుగా వేయకపోవడంతో ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ జయలక్ష్మిని వివరణ కోరగా ఇసుక వేలం పాట అనుమతికి ఆర్డీఓ కార్యాలయానికి నివేదిక పంపామని, అనుమతి రాగానే వేలం పాటకు పత్రికల్లో నోటిఫికేషన్ వేస్తామన్నారు.

పదోన్నతుల షెడ్యూల్ విడుదల చేయండి

టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ రాజమౌళి



దుబ్బాకలో నినాదాలు చేస్తున్న టీపీటీఎఫ్ నాయకులు

దుబ్బాకటౌన్: ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల షెడ్యూల్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ కౌన్సిలర్ రాజమౌళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం పట్టణంలోని స్థానిక మండల వనరుల కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయుల ఖాళీలను వెంటనే భర్తీ చేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలన్నారు. కామన్ స్కూల్, శాస్త్రీయ విద్యావిధానం అమలయ్యేలా, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్య పరిష్కారానికి టీపీటీఎఫ్ పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు నర్సింహారెడ్డి, సిద్ధిరాములు, ప్రదీప్, ఎల్లం, నూర్ బాబా, రాజు పాల్గొన్నారు.

ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా ప్రశాంత్



నియామక పత్రం అందిస్తున్న నాగరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా రామంచ గ్రామానికి చెందిన ప్రశాంత్ నియమితులయ్యారు. ఈమేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి మీసం నాగరాజు బుధవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే బడుగు, బలహీనవర్గాలకు న్యాయం జరుగుతుందన్నారు.

చేపల కోసం చెరువుకు గండి!

- ఎల్లమ్మ చెరువుకు గండి కొట్టిన కాంట్రాక్టర్
- 20 రోజులుగా వృథాగా పోతున్న నీరు
- పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు



హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువుకు గండికొట్టిన దృశ్యం

హుస్నాబాద్: కాకతీయులు నిర్మించిన ఎల్లమ్మ చెరువు ఒక్కసారి వర్షం కురిసి చెరువు నిండితే రెండేళ్ల వరకు సాగు, తాగునీటికి ఢోకా ఉండదు. హుస్నాబాద్ పట్టణంతోపాటు, చుట్టుపక్కల గ్రామాల్లోని బావుల్లో భూగర్భ జలాలు పెరుగుతాయి. హుస్నాబాద్‌లోని ఎలమ్మ చెరువు రెండు వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. అంతేకాకుండా పట్టణ ప్రజలకు నీటి సమస్య తలెత్తితే, ఎల్లమ్మ చెరువు నీటిని సరఫరా చేస్తారు. ఓ కాంట్రాక్టర్ చేపల కోసం అధికారుల అనుమతి లేకుండా చెరువుకు గండికొట్టి తూము ద్వారా నీటిని వదులుతున్నాడు. 20 రోజులుగా నీటిని విడుదల చేస్తుండటంతో చెరువు ఖాళీ అయ్యే పరిస్థితి నెలకొంది. గండికి మట్టి కట్ట అడ్డుపెట్టినా కాంట్రాక్టర్ రాత్రి వేళలో తొలగిస్తున్నాడు. కాంట్రాక్టర్ నీటిని విడుదల చేస్తున్నా ఇరిగేషన్ శాఖ పట్టించుకోవడం లేదు. చెరువులో తుమ్మ చెట్లను తొలగిస్తామనే సాకుతో నీటిని విడుదల చేయడం అన్యాయమని రైతులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నీటి విడుదలపై ఎవరికి చెప్పుకోవాలో తెలియక రైతులు అయోమయంలో ఉన్నారు. ఎమ్మెల్యే, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చెప్పుకుందామంటే ఆయన అమెరికా పర్యటనలో ఉన్నారు. చెరువు ఖాళీ అయితే మరో మూడేళ్ల వరకు ఈ ప్రాంత రైతులు, ప్రజలకు సాగు, తాగునీటి కోసం తిప్పలు తప్పవు. అధికారులు స్పందించకపోవడం వెనుక అంతర్యమేమిటని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య మాట్లాడుతూ ఎల్లమ్మ చెరువు నీటిని కాంట్రాక్టర్ అక్రమంగా విడుదల చేస్తున్నాడని ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. అధికారులు స్థానికంగా లేకపోవడం వల్లే కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నాడని మండిపడ్డారు. చేపలను వలలతో పట్టుకోవాలే తప్ప నీటిని ఖాళీ చేయడం సరికాదని, కాంట్రాక్టర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.



వెలికట్టలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద గుమిగూడిన రైతులు

జీలుగ అందక రైతుల్లో నిరాశ

కొండపాక(గజ్వేల్): మండలంలోని వెలికట్టలోగల ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం వద్ద జీలుగ విత్తనాల కోసం రైతులు ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరీక్షించారు. చివరకు విత్తనాలు దొరక్కపోవడంతో నిరాశతో వెనుదిరిగారు. బుధవారం జీలుగ విత్తనాలు పంపిణీ చేస్తారని మండలంలో ప్రచారం కావడంతో ఆగ్రోస్ సేవా కేంద్రానికి రైతులు భారీగా తరలివచ్చారు. ఉదయం 7 గంటలకే దుకాణానికి చేరుకున్నారు. వ్యవసాయాధికారులు రైతుల పట్టాదార్ పాస్ పుస్తకంలోని వివరాలు సరిచూసుకొని రైతుకు ఒక బ్యాగ్ మాత్రమే అందజేశారు. ఒక బ్యాగు రెండు ఎకరాల్లో సాగు చేసుకోవచ్చని, 200 బ్యాగులు రైతులకు అందజేశామని ఏఓ ప్రియదర్శిని తెలిపారు. విత్తనాలు సరిపడా ఉన్నాయని ఆందోళన చెందొద్దన్నారు. కాగా జీలుగ విత్తనాల మరిన్ని తెప్పించాలని రైతులు కోరారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు(హుస్నాబాద్): విద్యుత్ లైన్‌ల కింద ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్న కారణంగా మద్దూరు మండల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ సుధీర్‌బాబు తెలిపారు. గురువారం మద్దూరు మండల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించాలన్నారు.



క్రీడాకారులతో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

క్రీడాకారులకు టీషర్ట్‌ల బహూకరణ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని వడ్లూరు బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్‌లో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు బుధవారం టీషర్టులను బహూకరించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ రమ్య, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేణుక, శ్యాం సుందర్, కోచ్ సుమన్, పీఈటీ సతీష్ పాల్గొన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దందాపై ఉద్యమించండి

ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు నాయక్



మాట్లాడుతున్న గుగులోతు రాజు నాయక్

హుస్నాబాద్: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు, డొనేషన్లు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై ఉద్యమించాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోతు రాజు నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం కరీంనగర్ ఉమ్మడి జిల్లా ఎల్‌హెచ్‌పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలను వెంటనే మూసివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు పాఠశాలలకు టెక్నో లాంటి పేర్లతో ప్రచారం చేస్తూ ఆర్థిక దోపిడికి పాల్పడుతున్నారని ఆరోపించారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యం నాయక్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం



టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నరేందర్

గజ్వేల్: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ యూనియన్ (టీపీటీఎఫ్) ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం గజ్వేల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జోన్ కన్వీనర్ నరేందర్ సంఘం జెండాను ఆవిష్కరించారు. విద్యారంగ సమస్యల పరిష్కారంలో టీపీటీఎఫ్ ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ సీనియర్ నాయకులు రాంచంద్రం, రాజులు, ఎల్లయ్య, దూలం నర్సింలుగౌడ్, మల్లయ్య, నాగభూషణం, గెజిటెడ్ హెచ్‌ఎం కనక రాజు, జోన్ పరిధిలోని ఆయా మండలాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవసరానికి మించి ఎరువులు, విత్తనాలు

గజ్వేల్ ఏడీఏ బాబునాయక్



బాబునాయక్

గజ్వేల్ రూరల్: వర్షాకాలం సాగుకు సరిపడా విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని గజ్వేల్ ఏడీఏ బాబునాయక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ డివిజన్ పరిధిలోని గజ్వేల్, కొండపాకతోపాటు రాయపోల్ మండలాలకు కలిపి పత్తి విత్తనాలు 52,952 ప్యాకెట్లు అవసరముండగా 1,35,000 ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. అదే విధంగా వరి విత్తనాలు 12,500 క్వింటాళ్లు అవసరముండగా 13,200 క్వింటాళ్లు ఉన్నాయని, మొక్కజొన్న 232 క్వింటాళ్లకు 332 క్వింటాళ్లు, కందులు 42 క్వింటాళ్లకు 56 క్వింటాళ్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. అవసరానికి మించి విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. బీటీ-2 ఫార్ములా అన్ని కంపెనీల పత్తి విత్తనాలకు వర్తిస్తుందని, ఒకే రకంగా ఉంటుందన్నారు. రైతులు లైసెన్స్ కలిగిన కంపెనీల పత్తి విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. దళారులు, డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే ఏడీఏ లేదా ఆయా మండల వ్యవసాయాధికారులకు, 72888 94470, 72888 94473 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. విత్తనాలు ఆగ్రో రైతు సేవా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. అలాగే 450 టన్నుల యూరియా, 560 టన్నుల కాంప్లెక్స్, 339 టన్నుల డీఏపీ, 150 టన్నుల పొటాష్ అందుబాటులో ఉన్నట్లు చెప్పారు.

విత్తన సరఫరాలో ప్రభుత్వం విఫలం

మిరుదొడ్డి(దుబ్బాక): విత్తన సరఫరాలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని జెడ్పీటీసీ సూకూరి లక్ష్మీ విమర్శించారు. బుధవారం మిరుదొడ్డిలో ఆమె మాట్లాడుతూ రైతు రాజ్యమంటూ గొప్పలు చెప్పుకుంటున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో కనీసం జీలుగ విత్తనాలు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వానా కాలం సీజన్ ప్రారంభ దశలో విత్తనాల కోసం రైతులు విత్తనాల దుకాణాల వద్ద నిరీక్షించాల్సి వస్తోందన్నారు. రైతు సంక్షేమం కోసం పాటు పడాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు లింగం, టౌన్ ప్రెసిడెంట్ బాబు తదితరులు పాల్గొన్నారు.

టెట్ పరీక్షకు 91 మంది హాజరు

సిద్దిపేటఅర్బన్: పొన్నాలలోని ఇందూరు ఇంజినీరింగ్ కళాశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు బుధవారం 91 మంది హాజరయ్యారు. సీబీటీ విధానంలో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు నిర్వహించిన ఉదయం సెషన్‌కు 50 మందికి 45 మంది, మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు నిర్వహించిన సెషన్‌కు 50 మందికి 46 మంది హాజరయ్యారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు, అబ్జర్వర్ నాగభూషణం, టీసీఎస్ ఆఫీసర్ రాకేష్, పీఆర్వో రఘు, షాదుల్లా, డీపీ రావు, రాజేశ్వర్ పర్యవేక్షించారు.

కొండగట్టుకు పాదయాత్ర

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని చౌటపల్లికి చెందిన హనుమాన్ మాలధరించిన భక్తులు బుధవారం కొండగట్టుకు పాదయాత్రగా బయలుదేరారు. వీరంతా హనుమాన్ జయంతి నాటికి అక్కడకు చేరుకుంటారు. హనుమాన్ జయంతి సందర్భంగా పలువురు దీక్ష చేపట్టారు. పాదయాత్రగా వెళ్లడం సంతోషంగా ఉందని భక్తులు తెలిపారు.

విత్తన దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ తనిఖీలు

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలోని విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. విత్తనాలు, ఎరువుల స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ సంతోష్, ఏఎస్‌ఐ శంకర్‌రావు మాట్లాడారు. అనుమతులున్న కంపెనీల విత్తనాలు, మందులను మాత్రమే రైతులకు విక్రయించాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలు, మందుల గడువు తేదీలను ప్రతీరోజూ చూసుకోవాలని దుకాణ యజమానులకు సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ సాయి శంకర్ పాల్గొన్నారు.



బెజ్జంకిలో ఎరువుల దుకాణంలో వివరాలు తెలుసుకుంటున్న ఏఓ, ఏఎస్‌ఐలు

నకిలీ విత్తనాలు అమ్మితే..

కొండపాక(గజ్వేల్): రైతులకు నకిలీ విత్తనాలు, పురుగు మందులు అమ్మితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ హెచ్చరించారు. కుకునూరుపల్లిలో, కొండపాక మండలంలోని బందారం, అంకిరెడ్డిపల్లి, మర్పడ్గ, సిర్సనగండ్ల గ్రామాల్లోని ఎరువుల దుకాణాల్లో బుధవారం వ్యవసాయ అధికారులతో కలిసి త్రీటౌన్ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ నకిలీ ఎరువులు, మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. విడి విత్తనాలు విక్రయిస్తే టాస్క్‌ఫోర్సు అధికారులకు రైతులు సమాచారం అందించాలన్నారు. రోజువారీ అమ్మకాలు, స్టాక్ వివరాలు నోటీస్ బోర్డు ద్వారా తెలపాలన్నారు. కార్యక్రమంలో త్రీటౌన్ ఎస్‌ఐ సూర్యనారాయణ, ఏఓ ప్రియదర్శిని, టాస్క్ బృందం సభ్యులు, దుకాణదారులు తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే ..

కోహెడరూరల్(హుస్నాబాద్): విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని ఏఓ భోగేశ్వర్ అన్నారు. బుధవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఎస్‌ఐ తిరుపతితో కలసి తనిఖీలు నిర్వహించారు. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ శివకుమార్, రేఖ తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు(హుస్నాబాద్): నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ షేక్ యూనూస్ అహ్మద్ అలీ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాల్లో వ్యవసాయ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు కొనుగోలు చేస్తే రశీదు తీసుకోవాలన్నారు. తనిఖీల్లో ఏఓ రామకృష్ణ, ఏఈవో రాకేష్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక నిఘా..

కోహెడ(హుస్నాబాద్): నకిలీ విత్తనాల విక్రయాలపై పోలీసులు, వ్యవసాయ అధికారులు ప్రత్యేక నిఘా పెట్టారు. బుధవారం పలు విత్తనాల దుకాణాల్లో తనిఖీ చేపట్టారు. ఎస్‌ఐ తిరుపతి, మండల వ్యవసాయ అధికారి భోగేశ్వరస్వామి రికార్డులు పరిశీలించారు. విత్తన చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రేఖ, శివకుమార్, మహిపాల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్యాకెట్ సీల్ పరిశీలించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయ అధికారి నరేష్ విత్తన విక్రేతలను హెచ్చరించారు. బుధవారం మండల కేంద్రంలో పలు విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కృత్రిమ కొరత సృష్టించినా, నాసిరకం విత్తనాలు విక్రయించినా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ప్యాకెట్ సీలు పరిశీలించాలని కొనుగోలు చేయాలన్నారు

రైతులు ఒకే పత్తి వెరైటీ కోసం..

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని విత్తన దుకాణాల్లో బుధవారం పోలీస్, వ్యవసాయ శాఖ సిబ్బంది ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఎవరైన నకిలీ విత్తనాలు, లూజు విత్తనాలు రైతులకు అమ్మితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు ఒకే పత్తి వెరైటీ కోసం డిమాండ్ చేయొద్దన్నారు. పచ్చి రొట్ట విత్తనాల పంపిణీపై రైతులు ఆందోళన చెందొద్దని, అవసరమైన వారికి పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఏడీఈ మహేష్, ఎస్‌ఐ తోట మహేష్, ఏఓ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ వెరైటీలన్నీ ఒక్కటే..

చేర్యాల(సిద్దిపేట): బీటీ పత్తి విత్తనాలన్నీ ఒక్కటేనని వాటి కోసం రైతులు ఆందోళన చెందొద్దని ఏడీఏ టి.రాధిక అన్నారు. ప్రభుత్వం నిషేధించిన, కాలం చెల్లిన, నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ ఎల్.శ్రీను హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలు, గోదాముల్లో వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీలు చేపట్టారు. విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం వస్తే వెంటనే డయల్ 100 లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌కి సమాచారం అందించాలని, లేదా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కంట్రోల్ రూమ్ నంబర్ 87126 67100కు సమాచారం అందించాలన్నారు.



చేర్యాలలో తనిఖీలు నిర్వహిస్తున్న ఏడీఏ రాధిక

ప్రభుత్వ బడుల్లోనే చదివించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): ప్రభుత్వ ఉపాధ్యాయులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చదివించాలని ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి తాడూరి భరత్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలల పునఃప్రారంభం నాటికి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలన్నారు. మండలం ఏర్పాటైనా ఇప్పటి వరకు రెగ్యులర్ మండల విద్యాధికారి లేరని, వివిధ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రతీ పాఠశాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుల పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలనే నిబంధన తీసుకురావాలన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి భరత్

సాఫ్ట్‌బాల్ శిబిరానికి ఆదరణ

- వేసవి ప్రారంభం నుంచి శిక్షణ
- శిక్షణ పొందుతున్న 40 మంది విద్యార్థులు
- హర్షం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

బెజ్జంకి(సిద్దిపేట): జిల్లా యువజన క్రీడాశాఖ ఆధ్వర్యంలో మండలంలోని వడ్లూరు బేగంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సాఫ్ట్‌బాల్ అండర్ 16 వేసవి శిక్షణ శిబిరానికి అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఈనెల 1వ తేదీన ప్రారంభించారు. నెలపాటు కొనసాగుతుంది. మొత్తం 40 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు. విద్యార్థులు ఉత్సాహంగా శిబిరానికి వస్తున్నారు. వేసవిలో క్రీడా శిబిరాలు నిర్వహించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వేసవి శిబిరాలు గ్రామీణ విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు.



వడ్లూరు బేగంపేట శిక్షణా శిబిరంలో సాఫ్ట్‌బాల్ ఆడుతున్న విద్యార్థులు

చాలా సంతోషంగా ఉంది



సాఫ్ట్‌బాల్ ఆట అంటే నాకు ఎంతో ఇష్టం. మా పాఠశాలలో సమ్మర్ కోచింగ్ శిబిరం నిర్వహించడంతో క్రీడలోని మెలకువలు తెలుసుకున్నాను. రోజూ ఉదయం, సాయంత్రం సాధన చేస్తున్నాను. చాలా సంతోషంగా ఉంది.

– టొప్పో రక్షిత, బేగంపేట

మూడు కిలోమీటర్ల నుంచి వస్తున్నా



మా పాఠశాల ఇంటి నుంచి మూడు కిలోమీటర్ల దూరంలో ఉంది. సాఫ్ట్‌బాల్ శిక్షణ కోసం ప్రతీరోజు ఉదయం, సాయంత్రం వచ్చి నేర్చుకుంటున్నా. నా ఆట చాలా మెరుగుపడింది. శిబిరానికి ఉత్సాహంగా వచ్చిన వారు సెల్‌ఫోన్ వాడటంలేదు.

– డేవిడ్, ఒడ్డెర కాలనీ, బేగంపేట

ఆట మెరుగుపరుచుకున్నారు



సమయం దొరికితే సెల్‌ఫోన్‌తో ఆడుకునే విద్యార్థులు సమ్మర్ క్యాంపులో శిక్షణ పొందారు. గ్రామీణ విద్యార్థుల కోసం వేసవి శిబిరం మాపాఠశాలలో ఏర్పాటు చేశారు. జిల్లా యువజన క్రీడా శాఖతో పాటు సహకరించిన వారికి కృతజ్ఞతలు.

– సతీష్ కుమార్, పీఈటీ